




కాత్యాయనీగా దర్శనమిస్తున్న అలంపూర్ జోగుళాంబ


ఉమామహేశ్వర భ్రమరాంబ అమ్మవారు

కాత్యాయనీ దేవిగా దర్శనం

అలంపూరు/అచ్చంపేట అర్బన్, అక్టోబరు 8: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అలంపూర్‌లో జోగుళాంబ, ఉమామహేశ్వర క్షేత్రంలో భ్రమరాంబ ఆరో రోజు మంగళవారం కాత్యాయనీ అలంకరణలో దర్శనమిచ్చారు. అలంపూర్‌లో అమ్మవారికి విశిష్ఠ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని రథోత్సవంలో ఉంచి, ఆలయ ప్రాకారం చుట్టూ తిప్పారు. కార్యక్రమంలో ఈవో పురేందర్ కుమార్, తహసీల్దార్ మంజుల, ఎస్ఐ వెంకటస్వామి పాల్గొన్నారు. ఉమామహేశ్వర క్షేత్రంలో ఉత్సవ మూర్తులకు పూజలు చేయడంతో పాటు 600 మందికి అన్నదానం చేశారు.







అమ్మో టమాట

- కిలో రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయం
- ఉల్లిగడ్డ, పచ్చి మిర్చి ధరలదీ అదే పరిస్థితి
- కొనేందుకు జంకుతున్న పేదలు
- డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకనే..


మహబూబ్‌నగర్ రైతు బజారులో విక్రయిస్తున్న కూరగాయలు

పాలమూరు, అక్టోబరు 8: దసరా పండుగ దగ్గర పడుతున్న నేపథ్యంలో కూరగాయల ధరలు చుక్కలనంటుతున్నాయి. కూరల్లో రోజూ వాడే టమాట, ఉల్లిగడ్డ, పచ్చి మిర్చి ధరలు పెరగడం పేదలను ఆందోళనకు గురి చేస్తోంది. గత నెలలో కురిసిన అకాల వర్షాలకు తోటలు దెబ్బతినడం, ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకోవాల్సి రావడంతో ధరలు పెంచేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో కూరగాయల ధరలు 20 రోజుల నుంచి ఊహించనంతగా పెరిగాయి. జిల్లాలో ఐదువేల ఎకరాల్లోనే కూరగాయలు పండిస్తున్నారు. ఇవి పట్టణ ప్రజలు సగం మందికి కూడా సరిపోవు. దానికి తోడు గత నెలలో కురిసిన అకాల వర్షాలకు మెజారిటీ తోటలు దెబ్బతిన్నాయి. దాంతో కొద్దిపాటి పాలీహౌస్‌లు, చిన్నతోటలు మాత్రమే దిక్కయ్యాయి. డిమాండ్ మేర దిగుబడి లేకపోవడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం, కర్ణాటక, బెంగళూరు ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకుంటున్నారు. దాంతో దళారులు, వ్యాపారులు ధరలను అమాంతం పెంచేస్తున్నారు. 20 నుంచి 50 శాతం వరకు ధరలు పెరిగాయి. మే 26వ తేదీన కిలో రూ.25 ఉన్న ఉల్లిగడ్డ ధర నేడు రూ.50కి చేరింది. ఆగస్టులో టమాట ధర రూ.20 నుంచి రూ.40 ఉండగా, నేడు ఏకంగా రూ.80 నుంచి రూ.100కు అమ్ముతున్నారు. ఆకుకూరలదీ అదే పరిస్థితి నెలకొంది. వీటితోపాటు వంట నూనెలు, బియ్యం, పప్పుధాన్యాలు, చింతపండు ధరలదీ అదే వరస.

రైతు బజార్‌లో కూరగాయల ధరలు(కిలోకు) ఇలా..

పేరు	జూన్ 16న	ఈ నెల 8న
టమాట	60	80-100
వంకాయ	40	50-60
చిక్కుడు	60	80-90
బీరకాయ	60	80-100
ఆలుగడ్డ	30	40-50
ఉల్లిగడ్డ	25	50-60



కేజీ టమాట వంద రూపాయలా?

కిలో టమాట నూరు రూపాయలంటే ఎట్ల కొనాలే? కూరగాలయ ధరలు అమాంతం పెరిగాయి. టమాట, బీర, ఉల్లిగడ్డ, అల్లం ధరలు ఊహించనంత పెరిగాయి. మా ఆయనకొచ్చే ఆదాయం ఇట్లనే పెరిగితే బాగుండె. కూరగాయలు దొరకటం లేదని వ్యాపారులు ధర పెంచి అమ్ముతున్నరు.

- లలిత, గృహిణి, మహబూబ్‌నగర్

రూ.8.83 కోట్ల పరిహారం మంజూరు

మహబూబ్‌నగర్, అక్టోబరు 8: గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఉమ్మడి జిల్లాకు ప్రభుత్వం రూ.8.83 కోట్ల పరిహారం మంజూరు చేసింది. ఈ మేరకు మంగళవారం జీవో జారీ చేసింది. ఈ డబ్బులను ఎకరాకు రూ.10 వేల చొప్పున పంటలు దెబ్బతిన్న 8,082 ఎకరాల రైతులకు అందించనుంది. గత ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు ఆరు వరకు వారం రోజులపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు పలు పంటలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటలపై అధికారులు సర్వే చేసి, ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఉమ్మడి పాలమూరులోని ఏయే జిల్లాల్లో ఎన్ని ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయనే వివరాలు ప్రభుత్వం విడుదల చేసింది. తొందరలోనే రైతుల ఖాతాలో పరిహారం జమకానుంది. దీంతో రైతులకు ఊరట లభించనుంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న పంటలు, మంజూరైన పరిహారం వివరాలు

జిల్లా	ఎకరాలు	రైతులు	పరిహారం
నాగర్‌కర్నూల్	2290.31	2380	2,29,07,750
వనపర్తి	1986.31	2386	1,98,67,750
నారాయణపేట	1239.33	1060	1,23,98,250
గద్వాల	1800.19	1381	1,80,04,750
మహబూబ్‌నగర్	766	912	76,60,000
మొత్తం	8082.2	8127	80,83,9100





గద్వాల శివారులో పోలీసుల ప్రత్యేక డ్రైవ్

గద్వాల క్రైం, అక్టోబరు 8: గద్వాల శివారున నదిఅగ్రహారం రోడ్డులో పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్, రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిని గుర్తించి 15 పిటీ కేసులు, 20 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ధ్రువపత్రాలు లేని 20బైక్‌లను స్వాధీనం చేసుకొని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

వంగూరు, అక్టోబరు 8: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. అనంతరం మంగళవారం కల్వకుర్తి నియోజకవర్గం వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో వివిధ శాఖల వారీగా కొన్ని రోజులుగా చేపట్టిన అభివృద్ధి పనులను అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, కొండారెడ్డిపల్లి గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ముఖ్యమంత్రి సోదరుడు కృష్ణారెడ్డి, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో కలిసి కలెక్టర్ పరిశీ లించారు. ఈనెల 12న గ్రామంలో దసరా ఉత్సవాలకు రేవంత్‌రెడ్డి హాజరు కానుండడంతో హెలీప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా ముఖ్యమంత్రి హోదాలో గ్రామానికి వస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేయాలని, సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఎస్పీ మాట్లా డుతూ ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించేందుకు పోలీసులకు గ్రామస్థులు సహకరించాలని కోరారు. వారి వెంట వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లపై మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

బట్వాడా ఆలస్యం.. చేజారిన ఉద్యోగం

- జడ్చర్లలో పోస్టల్ శాఖ నిర్లక్ష్యంతో ఉద్యోగం కోల్పోయిన యువకుడు

- పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్‌కు బాధితుడి ఫిర్యాదు

జడ్చర్ల, అక్టోబరు 8: పోస్టల్ శాఖ ఉద్యోగి కాల్ లెటర్‌ను బట్వాడా చేయడంలో ఆలస్యం చేయడంతో ఓ యువకుడు ఉద్యోగాన్ని కోల్పోయిన ఘటన జడ్చర్ల మండలం గంగాపురంలో చోటు చేసుకున్నది. దీనికి సంబంధించి బాధితుడు, పోస్టల్‌శాఖ అధికారులు వెల్లడించిన వివరాలు.. తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్‌లో ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగానికి ఎస్సీ కోటాలో గంగాపురం గ్రామానికి చెందిన నాగ రాజు దరఖాస్తు చేసుకున్నాడు. గత సంవత్సరం దరఖాస్తు చేసుకోగా ఈ ఏడాది మార్చిలో సర్టి ఫికేషన్ వెరిఫికేషన్ పూర్తి చేశారు. అనంతరం అ భ్యర్థులకు కాల్‌లెటర్స్‌ను పంపిస్తామంటూ ఎల క్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ అధికారులు తెలిపారు. అందులో భాగంగానే సెప్టెంబరు 27న ఇంట ర్వ్యూకు హాజరు కావాలంటూ గంగాపురం నాగరాజుకు సెప్టెంబరు 4వ తేదీన ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ నుంచి కాల్ లెటర్‌ను పోస్టల్ శాఖలోని స్పీడ్ పోస్ట్ ద్వారా పంపారు. రెండు రోజుల వ్యవధిలో దీన్ని అందించాల్సి ఉండగా, పోస్టల్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా అక్టో బరు 4న గంగాపురంలో నాగరాజు ఇంటి పక్కన ఉన్న బంధువులకు అంద జేశారు. దీంతో ఇంట ర్వ్యూకు హాజరు కాలేక, వచ్చిన ఉద్యోగం చేజారిందని నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గ్రామస్థులతో కలిసి జడ్చర్ల పోస్ట్ ఆఫీస్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవికుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.


జడ్చర్ల పోస్ట్ ఆఫీస్‌లో అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవికుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న నాగరాజు

విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం..

నాగరాజుకు సంబంధించిన స్పీడ్‌పోస్ట్‌ను సకాలంలో బట్వాడా చేయలేదన్న అంశంపై విచారణ చేపట్టి బాధ్యులిపై చర్యలు తీసుకుంటాం. గంగాపురం చెందిన నాగరాజుకు సెప్టెంబరు 18న స్పీడ్ పోస్టు వచ్చింది. దీన్ని గంగాపురానికి బట్వాడా చేయాల్సి ఉండగా కావేరమ్మపేట బ్రాంచి పోస్ట్ కార్యాలయానికి పంపించాము. అసిస్టెంట్ బ్రాంచి పోస్ట్‌మాస్టర్‌కు అప్పగించగా, సెప్టెంబరు 26న నాగరాజుకు స్పీడ్‌పోస్ట్‌ను బట్వాడా చేసినట్లుగా పోస్టల్‌శాఖ ట్రాకింగ్ ఉంది. కాగా క్షేత్రస్థాయిలో అక్టోబరు 4న బట్వాడా అయినట్లు తెలుస్తున్నది. బట్వాడా చేయాల్సిన ఏబీపీఎం తన పదవికి రిజైన్ చేయడం వల్ల, అతని వద్ద ఉన్న స్పీడ్‌పోస్ట్‌ను మరో ఏబీపీఎం బట్వాడా చేసినట్లుగా ప్రాథమికంగా తేలింది. పూర్తి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- రవికుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్, జడ్చర్ల పోస్టాఫీస్

ఏటీఎం ధ్వంసం చేసిన గుర్తుతెలియని దుండగులు

అమరచింత, అక్టోబరు 8: మునిసిపాలిటీ కేం ద్రంలోని ఇండియా 1 ఏ టీఎం అద్దా లను, అందులోని సామగ్రిని గుర్తు తెలి యని దుండ గులు మంగ ళవారం తెల్లవారు జామున ధ్వంసం చేశా రు. పట్టణం లోని ప్రధాన రహదారిపై పక్కనే ఉన్న ఇండియా 1 ఏటీఎంను గుర్తు తెలియని ఆకతాయిలు ఏటీఎం అద్దాలను లోపలికి వెళ్లే డోర్‌ను లోపల చిన్నపాటి సామగ్రిని ధ్వంసం చేశారు. దీంతో ఉదయం అటుగా వెళ్లిన ప్రజలు ఏటీఎంను గమనించగా.. ఏటీఎం అద్దాలు మొత్తం ధ్వంసమై కనిపించాయి. ఏటీఎంలోని డబ్బులను ఏమాత్రం దుండగులు ముట్టుకోలేదు. మద్యం మత్తులో ఈ సంఘటనకు పాల్పడిన అనుమానిత వ్యక్తిని పట్టుకొని విచారణ చేస్తున్నామని ఎస్ఐ సురేష్ తెలియజేశారు.

కొల్లాపూర్ ఆర్డీవో సస్పెన్షన్

కొల్లాపూర్, అక్టోబరు8: కొల్లాపూర్ రెవెన్యూ డివిజనల్ కార్యాలయ అధికారి ఆర్డీవో నాగరాజును సస్పెండ్ చేస్తూ.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్డీవో నాగరాజు సస్పెండ్‌కు గల కారణాలు ఇలా ఉన్నాయి. కొల్లాపూర్ మండల పరిధిలోని జావాయిపల్లికి చెందిన కొంతమంది రైతులు ఇనామ్ ఓఆర్‌సిల కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ధరణి పోర్టల్ ప్రారంభం నాటి నుంచి ధరణిలో ఓఆర్‌పీ ఇంప్లిమెంట్ చేసేందుకు ఆప్షన్ లేదు. దీంతో ఆర్డీవో కార్యాలయం పరిధిలోనే తమకు ఓఆర్‌పీలు ఇవ్వాలని జావాయిపల్లికి చెందిన రైతులు కొల్లాపూర్ రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా.. అక్కడి నుంచి ఆ ఫైల్ ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరింది. ఇక్కడ ఇష్యూ పీపీబీ కోర్టు కేసు నంబర్ వేసి ఆర్డీవో కోర్టు ఓఆర్‌సీ నంబర్ వేయాల్సి ఉండగా.. గతంలో కూడా ఇనాం ఓఆర్‌సీ ఇలాగే అప్రూవల్ అయ్యేవి. కానీ జావాయిపల్లికి చెందిన 18 మంది రైతుల ఓఆర్‌సీ దరఖాస్తులను ఒకటే ప్రొసీడింగ్‌లో ఆర్డీవో రిజెక్టు లిస్టు పంపడంతో రైతులు కలెక్టర్ ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. తాము దరఖాస్తు చేసుకున్న ఇనాం ఓఆర్‌సీల కోసం ఒక్కొక్క రైతు నుంచి ఆర్డీవో నాగరాజు రూ.5 వేలు డిమాండ్ చేశారని జిల్లా అధికారుల ఎదుట రైతులు వాపోయినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో కలెక్టరేట్ కార్యాలయం నుంచి రైతులకు నోటీసులు ఇచ్చి ఆర్డీవో నాగరాజుకు మెమో జారీ చేసి కలెక్టర్ కార్యాలయానికి పిలిపించి విచారించినట్లు సమాచారం. రైతులంతా తమ గోడును వెళ్లబుచ్చుకోవడంతో జిల్లా ఉన్నతాధికారులు తమ నివేదికను సీసీఎల్ఏకు పంపడంతో విధుల పట్ల నిర్లక్ష్యం వహించారని గుర్తించి కొల్లాపూర్ ఆర్డీవో నాగరాజును సస్పెండ్ చేస్తూ.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బతుకమ్మ సంబురాల్లో అపశ్రుతి

● ఆర్మీ జవాన్‌పై కత్తితో యువకుడి దాడి

ధరూరు, అక్టోబరు 8: బతుకమ్మ సంబురాల్లో సౌండ్ పెద్దగా పెట్టారని, తగ్గించాలని కోరినా వినకపోవడంతో వారితో యువకుడు గొడవకు దిగాడు. ఇరువురి మధ్య ఘర్షణను నివారించేందుకు వెళ్లిన ఆర్మీ జవాన్‌పై సదరు యువకుడు కత్తితో దాడి చేసిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలం రేవులపల్లిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రేవులపల్లిలో ఓ ఇంటి వద్ద బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సమయంలో ఇంటి పక్కన ఉన్న కృష్ణ సౌండ్ ఎక్కువగా వస్తుందని, వారితో వాదనకు దిగి పిడిగుద్దులతో దాడి చేశాడు. ఇంతలో అక్కడే ఉన్న ఆర్మీ జవాన్ వారిని నివారించేందుకు వెళ్లగా.. సదరు వ్యక్తి ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకుని ఆర్మీ జవాన్‌పై దాడి చేశాడు. దాడిలో తీవ్రంగా గాయపడిన ఆర్మీ జవాన్‌ను చికిత్స నిమిత్తం గద్వాల ఆసుపత్రికి తరలించారు. ఘర్షణకు దిగి దాడికి పాల్పడిన యువకుడిని అదుపులోకి తీసుకున్నామని గద్వాల సీఐ నాగేశ్వర్ రెడ్డి తెలియజేశారు.

ఎక్సైజ్ శాఖ అధికారుల దాడులు

చారకొండ, అక్టోబరు 8: మండలంలోని చారకొండ, గోకారం, తుర్కలపల్లి గ్రామాల్లో మంగళవారం కల్వకుర్తి ఎక్సైజ్ శాఖ సీఐ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 15 లీటర్ల సారా, 20 కిలోల నల్ల బెల్లం పట్టుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ వెంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ఎవరైనా.. సారా కాచినా.. అమ్మినా.. నల్లబెల్లం విక్రయించినా.. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ రాజ్యలక్ష్మి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ సృజన, ఎన్‌ఫోర్స్‌మెంట్ మహబూబ్‌నగర్ టీమ్, డీటీఎఫ్ నాగర్‌కర్నూల్ టీమ్, ఎక్సైజ్ శాఖ కానిస్టేబుళ్లు రఘు, నార్య, పరశురాం, తిరుపతిరెడ్డి, మాధవి, అనూష తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ


బిజినేపల్లిలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఐ అరుణ

బిజినే పల్లి, అక్టోబరు 8: మం డల కేం ద్రంలోని మద్యం దు కాణాల్లో ఎక్సైజ్ శాఖ ఎస్ఐ అరుణ మంగ ళవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వైన్స్ షాపుల్లోని వివిధ మద్యం బాటిళ్లపై ఉన్న లేబుల్స్‌ను స్కాన్ చేసి పరిశీలి ంచారు. మద్యం నిల్వలు, అమ్మకాల రికార్డులను పరిశీలిం చారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోనే షాపులను తెరి చి ఉంచాలని, ఉదయం తొందరగా తెరవడం రాత్రి పూట స మయం దాటిన తర్వాత కూడా షాపులు తెరిచి ఉంచి మ ద్యం విక్రయాలు చేపట్టినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. అలాగే పండగల సమయంలో మ ద్యం కల్తీలకు పాల్పడినట్లు గుర్తిస్తే షాపు లైసెన్స్‌లను రద్దు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాస్కెట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి జిల్లా మహిళల జట్టుకు మూడోస్థానం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 8: హైదరాబాద్ హబ్సిగూడలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ టోర్నీలో ఉమ్మడి జిల్లా మహిళల జట్టు మూడో స్థానంలో నిలిచింది. మూడోస్థానంలో నిలవడంపై జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మక్సూద్ బిన్ అహ్మద్ జాకీరుక్సాద్‌బిన్, నసూరుల్లా హైదర్, తది తరులు జట్టును అభినందించారు.



18 నుంచి ఉమ్మడి జిల్లాలో క్రీడాజ్యోతి కార్యక్రమాలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు8: గ్రామీణ క్రీడాకారులను ప్రపంచ చాంపి యన్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సీఎం కప్- 2024 ని ర్వహిస్తుంది. 33 జిల్లా ల్లో క్రీడాజ్యోతి కార్య క్రమం నిర్వహించనున్నారు. ఇటీవలే ఎల్‌బీ స్టేడి యంలో సీఎం రేవం త్‌రెడ్డి క్రీడాజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నెల 18న క్రీడాజ్యోతి కార్యమంలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 10కె రన్ ఉద యం కొత్త కలెక్టరేట్ కార్యాలయం నుంచి లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌కు చేరుకుంటుంది. సా యంత్రం వనపర్తి చి ట్యాల గ్రామం నుంచి కలెక్టరేట్ వరకు రన్ కొన సాతుంది. 19న జోగుళాంబ గద్వాల జిల్లాలో ఉదయం సంగల పార్క్ నుంచి, ధరూర్ మీదుగా, కలె క్టరేట్ చౌరస్తా వరకు రన్ కొనసాగుతుంది. సాయంత్రం తిప్రాస్‌పల్లి నుంచి నారాయ ణపేట జిల్లా నర్సిరెడ్డి చౌరస్తా వరకు రన్ కొనసాగుతుంది. 20న ఉదయం మయూరి ఏకో పార్క్ నుంచి జిల్లా కేంద్రానికి రన్ చేరుకుంటుంది. ఆయా జిల్లాల క్రీడాశాఖ అధి కారులు ఇన్‌చార్జులుగా వ్యవహరించనున్నారు. ఇప్ప టికే తెలంగాణ స్పోర్ట్స్ అథా రిటీ ఆదేశాల మేరకు ఆయా జిల్లాలో ర్యాలీలు కొనసాగుతున్నాయి. మహ బూబ్‌నగర్ జి ల్లాలో ఈ నెల 20న నిర్వహించనున్న క్రీడా జ్యోతి కార్య క్రమంలో క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతి నిధులు, విద్యా ర్థులు, ప్రజా ప్రతి నిధులు పాల్గొని విజయ వంతం చేయాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ మంగళవారం తెలియజేశారు.

వెరిఫికేషన్ ప్రక్రియలో తప్పులపై ఆందోళన

- డీఈవో కార్యాలయం ఎదుట బైఠాయించిన అభ్యర్థులు

- ఉపాధ్యాయ సంఘాల మద్దతు

నారాయణపేట టౌన్, అక్టోబర్8: జిల్లా కేంద్రం నారాయణపేటలో మంగళవారం డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియలో తప్పులు సృష్టించడంతో అర్హులకు ఉద్యోగాలే రాలేదని, అనర్హులకు ఉద్యోగం వచ్చేటట్లు వెరిఫికేషన్ ప్రక్రియలో తప్పులు సృష్టించారంటూ పలువురు అభ్యర్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. 1:3లో ముందు ఉన్న అభ్యర్థి వెరిఫికేషన్‌కు హాజరుకాకున్నా డిస్ క్వాలిఫై చేయకుండా పెండింగ్‌లో చూపించడంతో తనకు ఉద్యోగం రాలేదని ఓ అభ్యర్థి ఆవేదన వ్యక్తంచేశారు. మరో అభ్యర్థి తనకు రెండు ఉద్యోగాలు వచ్చాయని, తన ప్రమేయం లేకుండానే తనకు మరో సబ్జెక్టు ఉద్యోగం కేటాయించడమేమిటని అభ్యంతరం తెలిపారు. డీఈవో కార్యాలయం ఎదుట చేపట్టిన ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. ఆందోళనలో పాల్గొని వెరిఫికేషన్ ప్రక్రియలో తప్పులు సృష్టించిన డీఈవోను వెంటనే సస్పెండ్ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. విషయం తెలియడంతో సీఐ శివశంకర్ సిబ్బందితో అక్కడికి చేరుకుని వారితో మాట్లాడి శాంతింపజేశారు. ఈ సందర్భంగా డీఈవో అబ్దుల్‌ఘని మాట్లాడుతూ 1:3 ప్రకారం జాబితాను పైకి పంపామని, ఏమైనా తప్పులు ఉన్నట్లు తేలితే విచారణ చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.


ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు సర్వం సిద్ధం

- ఉమ్మడి జిల్లాలో 86 పరీక్ష కేంద్రాలు - హాజరుకానున్న 30,496 మంది అభ్యర్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 8: గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహి స్తారు. పరీక్ష కేంద్రం పరిధిలో మూడు కిలోమీటర్ల పరిధిలోని జిరాక్స్ సెంట ర్లను మూసి ఉంచా లని అధికారులు తెలిపారు. పరీక్ష సమయంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుం దన్నారు. అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని పేర్కొన్నారు. మహబూ బ్‌నగర్ జిల్లాలో 36 కేంద్రాలలో పరీక్షకు ఏర్పాటు చేశారు. మొత్తం 15,199 మంది హాజరుకానున్నారు. వనపర్తి జిల్లాలో 17 పరీక్ష కేం ద్రాలు ఏర్పాటు చేశా రు. వనపర్తిలో 15, కొత్తకోటలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేయగా, మొత్తం 4,843 మంది అభ్యర్థులు ప రీక్ష రాయనున్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలో మొత్తం 18 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షకు 5,221 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో 5,233 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు.

తెలంగాణ క్రీడా ప్రాంగణాలు నాసిరకం

● ఉపాధి ప్రజావేదికలో తనిఖీ బృందం వెల్లడి

హన్వాడ, అక్టోబరు 8: ఉపాధి హామీ పథకం ద్వారా విడుదలైన నిధులతో నిర్మించిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలు నాసిరకంగా ఉన్నాయని ఉపాధి పథకంపై నిర్వహించిన తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. మండలంలోని 35 గ్రామాల్లో 2023 మార్చి నుంచి 2024 మార్చి వరకు రూ.6,60,17261 ఖర్చు చేయగా.. జరిగిన పనులపై సామాజిక తనిఖీ బృందం వారం రోజులుగా పనులు పరిశీలించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా వేదిక నిర్వహించారు. మండంలోని అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల్లో ఎక్కువగా నాణ్యత లేదని వెల్లడించారు. 18 గ్రామాలపై ప్రజా వేదిక నిర్వహించారు. మిగితా 17 గ్రామాల్లో బుధవారం ప్రజావేదిక జరుగనుందని ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా పీడీ నర్సింహులు మాట్లాడారు. ఉపాధి పథకంలో తప్పులు చేస్తే చర్యలు ఉంటాయాని హెచ్చరించారు. సమావేశంలో ఏపీడీ శ్రీపాద్, అంబుడ్స్ పర్సన్ సంతోష్‌కుమార్, డీవీఓ ప్రేమలత, ఏయం శృతి, ఎంపీడీవో యశోదమ్మ పాల్గొన్నారు.


ఏపీవోను ప్రశ్నిస్తున్న తనిఖీ బృందం సభ్యులు

మహిళపై ప్రైవేటు ఆసుపత్రి సిబ్బంది దాడి

అచ్చంపేటటౌన్, అక్టోబరు 8: వైద్యం కోసం వచ్చిన మహిళపై ప్రైవేట్ ఆసుపత్రి సిబ్బంది దాడికి పాల్పడిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో చోటు చేసుకుంది. బల్మూరు మండలం కొండనాగులకు చెందిన స్వాతి మంగళవారం ఉదయం 10గంటలకు అచ్చ ంపేటలోని ఏఎంఆర్ ప్రైవేటు ఆసుపత్రికి రాగా, వైద్యులు ఆమెకు కొన్ని టెస్టులు రాసి, అక్కడే చేయించారు. మందులు అందజేశారు. దీనికి బిల్లు రూ.1500 కాగా స్వాతి, టెస్టుల బిల్లు వెయ్యి రూపాయలు చెల్లించి, మందుల డబ్బులు రూ.500 తర్వాత చెల్లిస్తానని చెప్పారు. తాను నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలని, తిరిగి వచ్చాక మిగతా డబ్బులు చెల్లి స్తామని చెప్పారు. దీంతో ఆసుపత్రి సిబ్బంది డబ్బు కట్టి వెళ్లాలంటూ స్వాతి అడ్డుకున్నారు. ఈక్రమంలోనే తనపై దాడి చేసి గాయపరిచారని బాధితురాలు రోధిస్తూ తెలిపారు. కాగా ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగుల నుంచి ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తున్నారని స్థానికంగా విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. మహిళపై దాడిచేసిన వ్యక్తిని కఠినంగా శిక్షిం చాలని పలువురు కోరుతున్నారు. దాడి విషయమై డాక్టర్ శివను వివరణ కోరగా, మహిళపై దాడి జరగలేదని, రూ.500 ఇవ్వకుండా ఆమె చెప్పకుండా బయటికి వెళ్లారని, దీంతో సిబ్బంది ఆమెను డబ్బులు ఇవ్వమని అడిగారని అన్నారు. ఆమెనే దురుసుగా మాట్లాడిందని చెప్పారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి : కలెక్టర్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 8: గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సురవరం ప్రతాపరెడ్డి స్మారక గ్రంథాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోవర్ధన్ సాగర్ కలెక్టర్, అదనపు కలెక్టర్‌ను పూల మొక్క అందజేసి ఆహ్వానించారు. గోవర్ధన్ సాగర్ నూతనంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడంతో కలెక్టర్ ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం కలెక్టర్ గ్రంథాలయాన్ని తిరిగి చూసి పరిశీలించారు. పాఠకులు, నిరుద్యోగులతో మాట్లాడి ఇంటర్నెట్ సౌకర్యం, దినపత్రికల సౌలభ్యం, మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయని తెలుసుకున్నారు. పాఠకులకు అసౌకర్యం కలగకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, లైబ్రేరియన్ శ్రీనివాసులు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'డీఎస్సీలో ఎస్సీ అభ్యర్థులకు మోసం'

గోపాల్‌పేట, అక్టోబరు 8 : డీఎస్సీ ఫలితాలల్లో ఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని మహజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్ము కేశవులు అన్నారు. మండలంలోని తాడిపర్తి గ్రామంలో మహజన సోషలిస్టు పార్టీ ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో తెలంగాణ రాష్ట్రం మెదటి రాష్ట్రమని ప్రకటించి ముఖ్య మంత్రి ఇప్పుడు వర్గీకరణ అమలు చేయకుండా డీఎస్సీలో ఉద్యోగాలు భర్తీ చేస్తూ మాదిగలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. మాదిగలకు రావలసిన ఉద్యోగాలను మాలలకు దోచిపెడుతున్నారని సుప్రీం కోర్టు తీర్పును దిక్కరించిన ప్రభుత్వం వైఖరికి నిరసనగా మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు నేడు ఎస్సీ ఉప కులాలతో జిల్లా కేంద్రంలో నిరసన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గట్టుస్వామి, రాజేందర్, సతీష్, నాగరాజు, వెంకటేష్, చంద్రకాంత్, కురుమూర్తి, కృష్ణ, బాలవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశీలించిన అధికారులు

శ్రీరంగాపురం, అక్టోబరు 8: శ్రీరంగాపురం ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం మండల అధికారులు పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని సమస్యలను తెలుసుకున్నారు. ఎంపీడీవో నారాయణ మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రతను పాటించాలని సూ చించారు. కార్యక్రమంలో ఎంపీవో రాజు, పంచాయతీ కార్యదర్శి నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను ధ్వంసం చేసే విధానాన్ని మానుకోవాలి

- సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీ నారాయణ



మాట్లాడుతున్న సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ

వనపర్తి రూరల్, అక్టోబరు 8: విద్యా వ్యవస్థను ధ్వంసం చేసే విధానాన్ని మానుకోవాలని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని జాగృతి జూనియర్ కళాశాలలో తెలంగాణ విద్య పరిరక్షణ కమిటీ రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, నియోజకవర్గానికి ఇంటర్నేషనల్ స్కూల్ అని ప్రభుత్వ రంగంలో ఉన్న 17 యూనివర్సిటీలను సమగ్రంగా అభివృద్ధి చేసే బదులు స్పోర్ట్స్ యూనివర్సిటీని తీసుకురావడం అనైతికమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యా విధానాన్ని మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీటీఎఫ్ నాయకులు కిష్టప్ప, చిన్న రాములు, శ్రీశైలం, రామస్వామి, మద్దిలేటి, తెలంగాణ ప్రైవేటు టీచర్స్ ఫెడరేషన్ నాయకులు కొంకల వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసు నమోదైతే ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులే

- డిఫెన్స్‌కౌన్సిల్ ఉత్తరయ్య

వనపర్తి రూరల్, అక్టోబరు 8: క్రిమినల్ కేసులు నమోదైతే ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులు అని డిఫెన్స్ కౌన్సిల్ ఉత్తరయ్య అన్నారు. మంగళ వారం వనపర్తి మండలంలోని చిమనగుంటపల్లిలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిషేధ భూములు, లావుణి పట్టా భూముల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పిల్లలకు వాహనాలు ఇచ్చేటప్పుడు జాగ్రత్త వహించాలని లేనిపక్షంలో పిల్లల తల్లిదండ్రులపై క్రిమినల్ కేసులు అవుతాయని అన్నారు. క్రిమినల్ కేసులు అయితే ప్రభుత్వ ఉద్యోగం రాదని అన్నారు. మన భవిష్యత్తు మన చేతుల్లో ఉందని మన బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అన్నారు. గ్రామాలలో బాల్య వివాహాలు చేయకూడదని, అలా చేస్తే చట్టరీత్యా నేరమని అన్నారు. ఏ సమయంలోనైనా మహిళలకు, బాలికలకు వృద్ధులకు ఇబ్బందులు ఉన్నప్పుడు సఖీ సెంటర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో డిఫెన్స్ లీగల్ ఎడ్ కౌన్సిల్ శ్రీదేవి, డేగల కృష్ణయ్య, న్యాయవాది నరేంద్రబాబు, ఏఎస్ఐ గ్రామ ప్రజలు లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ పురస్కారం అందుకున్న కొత్తకోట విద్యార్థి

కొత్తకోట, అక్టోబరు 8: పట్టణానికి చెందిన అస్కని శ్రేయ ఎంబీఏ గోల్డ్ మెడలిస్టు సగర సంఘం రాష్ట్ర కమిటీ పంపిణీ చేసిన ప్రతిభా పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సగర కులంలో ప్రతిభ కనబరిచిన 150 మంది విద్యార్థులకు మంగళవారం ప్రతిభా పురస్కారాలు అందజేసినట్లు ఆమె తెలిపారు. పురస్కారాలు అందజేసిన వారిలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ రాజయ్య, ఐఏఎస్ మాజీ అధికారి చిరంజీవి, సగర సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు శేఖర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఆత్మకూరు, అక్టోబరు8: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఆత్మకూరు ఎస్ఐ నరేందర్ తెలిపారు. సోమవారం అర్ధరాత్రి ఆత్మకూరు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారంతో వాహనాల తనిఖీ చేపట్టాం. తిప్పడంపల్లి నుంచి మదనాపూర్ వెళ్తున్న ఆటోని తనిఖీ చేయగా.. అందులో సుమారు 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నాయని తెలిపారు. ఆత్మకూరు సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వేణు ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ దుబ్బాల లక్ష్మీనారాయణ, రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసిన తిరుమలాపూర్ వాసి రమేష్‌పైకేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 8: బాల్య వివాహాలు ప్రోత్సహించే వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి సఖికేంద్రం ఉద్యోగులకు సూచించారు. మంగళవారం ఆయన అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సఖి కేంద్రాన్ని సందర్శించారు. సఖి కేంద్రంలో సౌకర్యాలు, సమస్యలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. సఖి కేంద్రంలో నమోదైన కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... బాల్య వివాహాలు అరికట్టేందుకు అన్ని మతాలకు సంబంధించిన పెళ్లిళ్లు జరిపించే పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలను జరిపించడం చట్టరీత్యా నేరమనే విషయాన్ని వారికి తెలియజేయాలన్నారు. బాల్య వివాహాలపై ఫిర్యాదులకు ప్రజలు 1098 టోల్‌ఫ్రీ నెంబరు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మమ్మ, డీసీపీవో రాంబాబు ఉన్నారు.

భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో పాలమూరు రంగారెడ్డి, కేఎల్ఐ ఇతర రిజర్వాయర్ ప్రాజెక్టుల భూసేకరణపై సమీక్ష నిర్వహించారు. అదే విధంగా జిల్లాలో పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లల్ని గుర్తించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వైద్య శాఖ, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేష్, డీడబ్ల్యూవో లక్ష్మమ్మ, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో పద్మావతి, ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, ఈఈ మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ రాజ్ కార్యనిర్వాహక ఇంజనీరు మల్లయ్య, జడ్పీ సీఈవో యాదయ్య, వైద్య శాఖ నుంచి ప్రోగ్రాం ఆఫీసర్ పరిమళ, డీఈలు సీపీవోలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులు వేగంగా చేయాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా : ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వర్షాలకు దెబ్బతిన్న రహదారులను గుర్తించి వెంటనే మరమ్మతులు పూర్తి చేయాలన్నారు.

నేషనల్ హెల్త్ మిషన్, 15వ ఆర్థిక సంఘం కింద మంజూరు అయిన సబ్ సెంటర్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా పూర్తి అయిన పనులకు బిల్లులు చెల్లించాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరు అయిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.



అమరచింత శివాజీ నగర్‌లో గౌరీదేవి అవతారంలో దుర్గామాత



అమరచింత కాళికాదేవి ఆలయంలో శ్రీ లలితాత్రిపుర సుందరీదేవి అవతారంలో దుర్గామాత



పెబ్బేరు పట్టణంలో శ్రీలక్ష్మీదేవి అలంకరణలో అమ్మ వారు



కొత్తకోటలో అర్ధనారీశ్వరి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

బిజ్జామణపురం, అక్టోబరు 8: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఉప్పరపల్లి, మానాజీపేట, మామిడిమాడ, సల్కెలాపూర్, సోలీపూర్‌లలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బిజ్జామణపురం పట్టణంలోని కుర్వగేరి శివాలయం ఆవరణలో మంగళవారం దుర్గామాత అమ్మ వారి విగ్రహాలకు అభిషేకం చేశారు. ఉప్పరపల్లి గ్రామంలో బద్రి నారాయణస్వామి ఆలయం ఆవరణలోని దుర్గామాత అమ్మవారు మహాలక్ష్మి రూపంలో దర్శనమిచ్చారు. మిగతా గ్రామాల్లో దుర్గామాత లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. సాయంత్రం కుంకుమార్చన చేసి అఖండ భజనలు నిర్వహించారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని కేశవస్వామి, బాలబ్రహ్మేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వర స్వామి ఆలయాలలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. లలితా త్రిపుర సుందరీదేవి అవతారంలో దర్శనం ఇచ్చిన అమ్మ వారికి మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

అమరచింతలో..

అమరచింత : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాతకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శివాజీనగర్, విఘ్నేశ్వర భవానీ నగర్‌లలో ప్రత్యేక మండపాల్లో వెలిసిన దుర్గామాత గౌరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీకృష్ణ నగర్‌లోని కాళికాదేవి ఆలయంలో శ్రీ లలిత త్రిపుర సుందరి అవతారంలో దుర్గామాత భక్తులకు దర్శనమిచ్చారు.



ఉప్పరపల్లి గ్రామంలో కరెన్సీ నోట్ల అలంకరణలో దుర్గామాత

గోపాల్‌పేటలో..

గోపాల్‌పేట : మండల కేంద్రంలో చెన్నకేశవ ఆలయం దగ్గర దేవీ నవరాత్రులను గ్రామస్థులు భక్తి కీర్తనలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారు లక్ష్మీదేవి అవతరంలో భక్తులకు అమ్మవారు దర్శనం ఇచ్చారు.

పెబ్బేరులో..

పెబ్బేరు : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పెబ్బేరు పట్టణంలో మంగళవారం వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మ వారిని లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కోటి రూపాయలతో లక్ష్మీదేవిని అలంకరించారు. అనంతరం ఆలయ పూజారి కిట్టు స్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కొత్తకోటలో..

కొత్తకోట : మండలంలో నవరాత్రుల పూజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. పట్టణంలో అంబా భవానీ ఆలయంలో అర్ధనారీశ్వరి దేవిగా, పార్వతీదేవి లలితాత్రిపుర సుందరీ దేవిగా, వాసవి మాత లలితా దేవిగా, కానాయపల్లి గ్రామంలోని జ్ఞానాంబికా దేవి లలితా దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. పట్టణంలోని దండుగడ్డ, పామాపురం, రామకృష్ణాపురం, పాలెం, కనిమెట్ట గ్రామాలలో నెలకొల్పిన దేవి మండపాలలో శరన్నవరాత్రుల పూజలు కొనసాగాయి.



గోపాల్‌పేటలో లక్ష్మీదేవిగా అమ్మవారు

శుభ్రత పాటించి వ్యాధులను అరికడదాం



ఆత్మకూరు పట్టణంలో మురుగు కాలువలో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

ఆత్మకూరు, అక్టోబరు 8: వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించి వ్యాధులను అరికట్టాలని మునిసిపల్ ఛైర్‌పర్సన్ గాయత్రి అన్నారు. డ్రై డే సందర్భంగా ఆత్మకూరు పట్టణంలోని ఏడో వార్డులో మంగళవారం మునిసిపల్ కమిషనర్ నాగరాజు, వార్డు కౌన్సిలర్ నాగలక్ష్మి, పారిశుధ్య కార్మికులతో కలిసి శుభ్రత కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పరిసరాల చుట్టు నీరు నిల్వ ఉంటే దోమలు ఈగలు వ్యాప్తి చెంది రోగాలు ప్రబలే అవకాశం ఉంది. కావునా పరిసరాల శుభ్రత పాటించాలని, ఇంట్లో పాత వస్తువులు ఉంచుకోవడం వల్ల దోమలు చేరే అవకాశం ఉంది. దీని ద్వారా మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికున్ గున్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. పాడైపోయిన వస్తువులను చెత్త బుట్టలలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, ఆశ కార్యకర్తలు , ఆర్పీలు పాల్గొన్నారు.

శుభ్రతతోనే దోమల వ్యాప్తికి చెక్

పాన్‌గల్ : పరిసరాల పరిశుభ్రతతోనే దోమల వ్యాప్తికి చెక్ పెట్టవచ్చని సీహెచ్‌సీ ఆఫీసర్ రామయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోప్లాపూర్‌లో మండల ప్రాథమిక వైద్యాధికారి చంద్రశేఖర్ ఆదేశానుసారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి నీటి తొట్లల్లోని నిల్వనీటిని పారబోశారు. నిల్వనీటిలో దోమలు వ్యాప్తి చెంది కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గున్యా వ్యాధులకు కారణమవుతాయని తెలిపారు. ప్రతీ ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాంచందర్, పంచాయతీ కార్యదర్శి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీడీసీ ఛైర్మన్‌కు సన్మానం



చంద్రశేఖర్ రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కొత్తకోట, అక్టోబరు 8: మండలంలోని అప్పరాల గ్రామ సమీపంలో ఉన్న కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ చెరకు అభివృద్ధి మండల కమిటీ ఛైర్మన్‌గా కొత్తకోటకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి (గొల్ల బాబు) నియమితులయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డిని అభినందిస్తు ఫ్యాక్టరీకి చెరకును అందించే రైతులకు న్యాయం చేయడానికి కృషి చేయాలని సూచించారు.

నిరుద్యోగుల హర్షం

పాన్‌గల్, అక్టోబరు 8: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో స్పెషల్ ఎడ్యుకేషన్‌లో సెకండరి గ్రేడ్ టీచర్‌గా ఎంపికైన నిరుద్యోగులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. డీఎస్సీలో ఎంపికైన కొంత మంది రిహాబిలేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సమయానికి సర్టిఫికెట్ రాకపోవడంతో ఉద్యోగం రాదని ఆందోళన చెందారు. ఈ విషయాన్ని అభ్యర్థులు డీసీసీబీ ఛైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి ద్వారా ఎంపీ మల్లురవి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపీ ఆర్‌సీఐ ఆఫీస్‌కు వెళ్లి అధికారితో మాట్లాడి తెలంగాణలోని పది జిల్లాల నుంచి వచ్చిన 30 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. దీంతో అభ్యర్థులు డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీ మల్లురవికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ

అమరచింత, అక్టోబరు 8: మండలంలోని నాగల్ కడుమూరు గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు మంగళవారం ఏఈపీవో నర్సింహయ్య దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ... గ్రామాన్ని శుభ్రంగా ఉంచుతూ గ్రామ ప్రజలను ఆరోగ్యంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులదే కీలక పాత్ర అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్, కార్మికులు గ్రామస్థులు ఉన్నారు.

పండ్ల తోటల పెంపకంలో శిక్షణ

వీపనగండ్ల, అక్టోబరు 8: పండ్లు, పూలు, కూరగాయల పెంపకంపై మదనాపూర్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిరుద్యోగులకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు అగ్రికల్చర్ అధికారి కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నారు పెంచడంలో యాజమాన్య పద్ధతులపై ఆరు రోజులు శిక్షణ ఇస్తామన్నారు. వనపర్తి జిల్లాకు చెందిన నిరుద్యోగులు తమ పేర్లను కృషి విజ్ఞాన కేంద్రంలో నమోదు చేయించుకోవాలని తెలిపారు.

బీజేపీ నాయకుల సంబురాలు

అమరచింత, అక్టోబరు 8: హర్యానా రాష్ట్రంలో బీజేపీ మూడోసారి అధికారం చేపడుతున్న సందర్భంగా మంగళవారం బీజేపీ అమరచింత నగర శాఖ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని బీజేపీ జెండా కట్ట వద్ద ప్రధాన రహదారిపై పటాకులు కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు క్యామ భాస్కర్ మాట్లాడుతూ... హర్యానాలో తమ పార్టీ హ్యాట్రిక్ సాధించడంతో పాటు జమ్ము కాశ్మీర్‌లో సైతం బీజేపీ ఒంటరిగా పోటీ చేసి అత్యధిక సీట్లు సాధించిందన్నారు. తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ సంబురాల్లో బీజేపీ నాయకుడు మేర్వ రాజు, నరాల నారాయణ, మరాఠీ అశోక్, సిద్ది రాములు, నరసింహ గౌడ్, వాటర్ శ్రీను, రాకేష్ శెట్టి, అనిల్, విజయ్ యాదవ్, గోవర్ధన్, మేర్వ శ్రీను, పాండు, నరేష్, రామకృష్ణ, నాని తదితరులు ఉన్నారు.



పటాకులు కాల్చి సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

గోపాల్‌పేట, అక్టోబరు 8: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా సభ్యత్వ నమోదు చేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రామన్న గారి వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చాకల్‌పల్లి గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ గ్రామంలో యువకులు, మహిళలు స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకుంటున్నారని, నాయకులు, కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పెద్దిరెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ అధ్యక్షుడు అరవింద్ రెడ్డి, యువకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రావొద్దు

ఆత్మకూరు, అక్టోబరు 8: తాగునీటి సమస్య, వీధి లైట్లు, మురుగునీటి కాలువల పరిశుభ్రత వంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆత్మకూరు తహసీల్దార్, మూలమల్ల గ్రామ ప్రత్యేక అధికారి చాంద్‌పాషా అన్నారు. మండలంలోని మూలమల్ల గ్రామంలో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో తాగునీటి సమస్య, వీధి లైట్లు, మురుగునీటి కాలువలు, పారిశుధ్య కార్మికుల పనితీరుపై పంచాయతీ కార్యదర్శి జైపాల్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఓల్డ్ కాలనీకి వచ్చే తాగునీటి బోరు పని చేయకపోవడంతో వాటిని తక్షణమే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. వర్షాకాలం కావడంతో వర్షపు నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి నీటిని తొలగించేందుకు పారిశుధ్య కార్మికులు శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామానికి కృష్ణానది, గ్రామం చుట్టు చెరువులు ఉన్న కారణంగా దోమలు అధికంగా ఉండే అవకాశం ఉంది. కావునా జాగ్రత్తలు పాటించే విధంగా అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారి శ్రీరామ్‌రెడ్డి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



బోరు మరమ్మతు చేస్తున్న తహసీల్దార్